వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 5 జూలై 2024



# ఎన్నిసార్లు పెళ్లి చేసుకోవాలి?

'భారతీయుడు 2' చిత్రంతో త్వరలోనే ప్రేక్షకులను పలకరించనున్నారు నటి రకుల్‌ప్రీత్ సింగ్ . కమల్ హాసన్ హీరోగా రూపొందిన ఈ సినిమాలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ మూవీ ప్రచారంలో భాగంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులు/నెటిజన్లతో ముచ్చటించారు. వారిలో ఒకరు తన పెళ్లి గురించి ప్రశ్నించగా రకుల్ ఆశ్చర్యపోయారు. 'మేడమ్.. వెడ్డింగ్ ఎప్పుడు ప్లాన్ చేశారు' అని అడగ్గా 'ఎన్ని సార్లు చేసుకోవాలి' అంటూ ఫన్నీ రిప్లై ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆమె వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. నిర్మాత జాకీ భగ్నానీతో కలిసి ఏడడుగులు వేశారు. తమ పెళ్లి వేడుక ఫొటో షేర్ చేస్తూ సదరు నెటిజన్‌కు రకుల్ సమాధానమిచ్చారు.



# మరో మైలురాయి దాటిన 'కల్కి 2898 ఏడీ'

కలెక్షన్స్ విషయంలో 'కల్కి 2898 ఏడీ' మరో మైలురాయి దాటింది. ఇప్పటి వరకూ ఈ సినిమా రూ. 700 కోట్లకుపైగా వసూళ్లు చేసిందని చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కొత్త పోస్టర్ విడుదల చేసింది. హీరో లేకుండా కేవలం దీపికా పదుకొణె పాత్రకు సంబంధించిన లుక్‌ను హైలైట్ చేయడం విశేషం. ఈ మైథాలజీ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడమే తరువాయి అంటూ ప్రభాస్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# కథ విన్నప్పుడు అమ్మే గుర్తొచ్చేది

మనందరి కథతో '35 చిన్న కథ కాదు' చిత్రం తెరకెక్కిందన్నారు రానా దగ్గుబాటి. ఆయన సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న చిత్రమిది. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటించారు. నందకిశోర్ ఈమని దర్శకుడు. ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. హైదరాబాద్‌లో టీజర్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు రానా దగ్గుబాటి మాట్లాడుతూ "నేను స్కూల్‌లో ఉన్నప్పుడు 35 అనేది నాకొక పెద్ద పర్వతం. లెక్కల్లో 35 వచ్చుంటే నేను పదోతరగతి పాసయ్యేవాడిని. దర్శకుడు ఈ కథ చెప్పిన ప్రతిసారీ నాకు మా అమ్మ గుర్తొచ్చేది. చాలా మంది జీవితంలా ఉంటుందీ కథ. హృదయాన్ని కదిలించే ఇలాంటి కథలు సురేష్ ప్రొడక్షన్స్‌లో చేయాలనేది మా ఉద్దేశం" అన్నారు. "తెలుగు చిత్ర పరిశ్రమకి వచ్చాక నా మొదటి పరిచయం రానా దగ్గుబాటి. ప్రతి నటుడికీ, సాంకేతిక నిపుణుడికీ తను సహకారం అందిస్తాడు. నా జీవితంలో చాలా ప్రత్యేకమైన సినిమా ఇది. అమ్మని చూస్తూ పెరిగాను కానీ, అమ్మలా నటించడం సవాల్‌గా అనిపించింది. టీజర్‌తో మా కథా ప్రపంచాన్ని పరిచయం చేశాం" అన్నారు నివేదా. "నా కెరీర్‌లో ఓ మైలురాయి ఈ సినిమా. ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని పంచుతుంది. ప్రతి ఒక్కరూ చూసి గర్వపడేలా ఉంటుంది" అన్నారు సృజన్ యరబోలు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

# శరవేగంగా 'విశ్వంభర'..

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర' . ఈ సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా దీనిపై నిర్మాణసంస్థ ఓ అప్‌డేట్ షేర్ చేసింది. సినిమా డబ్బింగ్ వర్క్ మొదలైనట్లు తెలిపింది. దీనికి సంబంధించిన పనులు ఈరోజు ప్రారంభమయ్యాయని పేర్కొంది. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని తెలిపింది. ప్రేక్షకులంతా జనవరి 10న అద్భుతమైన అనుభూతిని పొందడానికి సిద్ధంగా ఉండాలని కోరింది.




# సన్నద్ధమవుతున్న మోక్షజ్ఞ

నందమూరి కుటుంబం నుంచి మరో వారసుడి తెర ప్రవేశం ఖాయమైనట్టే. అగ్ర కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఈ ఏడాదే కెమెరా ముందుకొస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ సినిమా వేడుకలో ఆ సంకేతాలిచ్చారు బాలకృష్ణ. ప్రస్తుతం మోక్షజ్ఞ అందుకు సంబంధించిన సన్నాహాల్లోనే ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా ఆయన ఓ ఫొటోషూట్‌లో పాల్గొనగా, అందులోని కొన్ని లుక్స్ బయటికొచ్చాయి. అప్పటినుంచి సామాజిక మాధ్యమాల్లో మోక్షజ్ఞ తెర ప్రవేశంపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. పలువురు యువ దర్శకులు ఆయన కోసం కథలు సిద్ధం చేసినట్టు సమాచారం. అందులో 'హను-మాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరి బాలకృష్ణ ఎవరి కథకు పచ్చజెండా ఊపుతారు? మోక్షజ్ఞ ఎవరి దర్శకత్వంలో తెరకు పరిచయం అవుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# 'భారతీయుడు2'లో నటించడానికి ఏకైక కారణమిదే: కమల్ హాసన్



కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారతీయుడు 2'. వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా రానుంది. జులై 12న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కమల్ హాసన్ పార్ట్3 గురించి చూడా ఆసక్తికర కామెంట్స్ చేశారు.

'నిజం చెప్పాలంటే.. 'భారతీయుడు 2' చేయడానికి ఏకైక కారణం పార్ట్3. మూడో భాగానికి నేను అభిమానిగా మారాను. సాధారణంగా ప్రేక్షకులకు మొదటి భాగం లేదా రెండో భాగం నచ్చుతుందేమో.. కానీ నాకు 'భారతీయుడు2'తో పాటు పార్ట్3 కూడా బాగా నచ్చింది. అది రిలీజ్ కావాలంటే ఆరు నెలల సమయం పడుతుంది. అప్పటి వరకు ఎలా వేచి ఉండాలో తెలియక టెన్షన్‌గా ఉంది' అని చెప్పారు. ఇక 'ఇండియన్ 3'లో సేనాపతి తండ్రి పాత్ర కూడా తెరపై కనిపిస్తుందని కమల్ ఇటీవల వెల్లడించారు. అలాగే సోషల్ మీడియాలో ఈ చిత్రం గురించి వస్తోన్న కథలేవీ నిజం కాదని స్పష్టం చేశారు.

# రామ్ చరణ్ దంపతుల మాటతో నా సంతోషం వెయ్యి రెట్లు పెరిగింది: జానీ మాస్టర్



రామ్ చరణ్ దంపతులు ఇచ్చిన మాటతో తన సంతోషం వెయ్యి రెట్లైందన్నారు ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్. డ్యాన్సర్స్ యూనియన్‌లోని కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో సాయం చేస్తామని మాటిచ్చినట్లు తెలిపారు. దీనిపై ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

'సరైన సమయంలో సహాయం చేస్తే దేవుడు అంటారు. నా పుట్టినరోజు సందర్భంగా రామ్ చరణ్ అన్న వాళ్ల ఇంటికి పిలిచారు. వారికి నా మీదున్న ప్రేమకు చాలా సంతోషించా. అక్కడికి వెళ్లాక చిరంజీవి ఆశీర్వాదంతో పాటు చరణ్ అన్న, ఉపాసన వదిన ఇచ్చిన మాటకు నా సంతోషం వెయ్యి రెట్లు పెరిగింది. నేను గతంలో అడిగిన సాయాన్ని గుర్తుంచుకున్నారు. మా డ్యాన్సర్స్ యూనియన్‌లో ఉన్న 500లకు పైగా కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్ అందేలా అండగా ఉంటామన్నారు. అడిగిన సాయాన్ని గుర్తుంచుకొని.. ఇచ్చిన మాటకి విలువనిస్తూ.. అన్ని కుటుంబాలను చేరదీయడం సామాన్యమైన విషయం కాదు. మా అందరి మనసులు కృతజ్ఞతతో నిండిపోయాయి. మా అందరి తరపున మీకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. మీలాంటి వారితో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా' అని రాసుకొచ్చారు. రామ్ చరణ్ దంపతులతో దిగిన ఫొటోను జానీ మాస్టర్ షేర్ చేశారు. దీంతో రామ్ చరణ్ దంపతుల మంచి మనసుకు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.


# అమ్మాయిలను ఆ ఒక్క ప్రశ్న అడగొద్దు: శ్రుతి హాసన్

సినిమాలతో బిజీగా ఉంటూనే అభిమానులతో ముచ్చటిస్తుంటారు నటి శ్రుతి హాసన్. తాజాగా ఇన్‌స్టాలో తన ఫాలోవర్స్‌తో చిట్‌చాట్ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రుతి 'ప్రేమ'కు అర్థం చెబుతూ.. అది ఒక అద్భుతమైన భావన అన్నారు. మన జీవితాల్ని నడిపించేది ప్రేమేనని.. ప్రతి ఒక్కరూ తాము చేసే పనిని ప్రేమించాలని సూచించారు. పెళ్లి గురించి కొందరు ప్రశ్నించడంపై కాస్త అసహనం వ్యక్తంచేశారు.

మీరు పెళ్లెప్పుడు చేసుకుంటారని ఓ నెటిజన్ అడగ్గా.. 'నేను చేసుకోను సర్' అని ఫన్నీ రిప్లై ఇచ్చారు. మీకు కాబోయే భాగస్వామి ఎలా ఉండాలనుకుంటున్నారని మరో అభిమాని ప్రశ్నించగా.. 'ఇది 2024.. అమ్మాయిలను ఇలాంటి ప్రశ్నలు అడగడం ఆపేయండి. ఇవి చాలా సిల్లీగా అనిపిస్తాయి. అమ్మాయిలకు ఏది సంతోషాన్నిస్తుందో.. ఆ పనిని చేసుకోనివ్వండి' అని సమాధానమిచ్చారు. ఇకపోతే, ఇటీవల కూడా తనను రిలేషన్‌షిప్‌కు సంబంధించిన ప్రశ్నలు అడగొద్దని శ్రుతి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో 'మీరు సింగిలా.. రిలేషన్‌లో ఉన్నారా?' అని సోషల్ మీడియా వేదికగా ఒకరు ప్రశ్నించారు. దీంతో తనకు ఆ తరహా ప్రశ్నలు నచ్చవంటూనే సింగిలే అని క్లారిటీ ఇచ్చారు శ్రుతి. రిలేషన్ కోసం ఎదురుచూస్తున్నానన్నారు. దిల్లీకి చెందిన ప్రముఖ డూడుల్ ఆర్టిస్ట్ శాంతను హజారికతో ఆమె ప్రేమలో ఉన్నట్లు నాలుగేళ్ల క్రితం ప్రకటించగా.. ఇటీవలే వీళ్లిద్దరికీ బ్రేకప్ అయిన సంగతి తెలిసిందే.



# అమ్మాయిగా 'విష్వక్ సేన్'!




విభిన్న కథలతో అలరిస్తుంటారు యంగ్ హీరో విష్వక్ సేన్. ఆయన ఇటీవల 'లైలా' అనే కొత్త సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దాని ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం అది చర్చనీయాంశంగా మారింది.

ప్రతి సినిమాకు వైవిధ్యాన్ని చూపించే విష్వక్ ఈ సినిమాలో అమ్మాయిగా కనిపించనున్నారు. అయితే కొన్ని సన్నివేశాల్లోనే అలా కనిపిస్తారా.. లేదంటే ఎక్కువ భాగం అలానే అలరిస్తారా అనేది తెలియాల్సి ఉంది. 'తన అందమైన కళ్లతో.. మనోహరమైన రూపంతో ఈ లైలా అందరినీ ఆశ్చర్యపరుస్తుంది' అంటూ విష్వక్ సేన్ లేడీ గెటప్‌లో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రమిది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

